www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 19 జులై 2024
5
కాకినాడ



కాటన్ బ్యారేజ్ వద్ద 10 అడుగుల నీటిమట్టం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గోదావరి నీటి మట్టం స్వల్పంగా పెరిగింది. మూడు రోజులుగా నిలకడగా ఉన్న నీటి మట్టం గురువారం సాయంత్రానికి స్వల్పంగా పెరిగింది. ప్రస్తుతం బ్యారేజ్ వద్ద 10 అడుగులకు చేరింది. ఇన్ ఫ్లో 1.53లక్షల క్యూసెక్కులు కాగా, అవుట్ ఫ్లో 1.43లక్షల క్యూసెక్కులు ఉంది. పంట కాలువల ద్వారా 8,700క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. వర్షాల నేపథ్యంలో జిల్లాలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. కలెక్టరేట్ (8977935609), రాజమండ్రి ఆర్డిఒ కార్యాలయం (0883 2442344), కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయం(08812 231488) విద్యుత్తు ఫిర్యాదుల కేంద్రం కంట్రోల్ రూం(1902)లను ఏర్పాటు చేశారు.

అంగన్‌వాడీలపై అదనపు భారం

- ఎరుగుతున్న కూరగాయల ధరలు
- పభుత్వం ఇస్తున్నది అరకొర ఛార్జీలే
- తడిసి మోపెడవుతున్న వంట ఖర్చులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కాకినాడ రూరల్ వలసపాకల 3వ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో 100 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో 87 మంది చిన్నారులు, 3 నుంచి 6 ఏళ్లలోపు 22 మంది ప్రీస్కూల్ పిల్లలు ఉన్నారు. బియ్యం, పప్పులు, ఆయిల్ ప్రభుత్వమే సరఫరా చేస్తుంది. కూరగాయలు, తాలింపు సామాన్లు, రవాణా ఖర్చుల కోసం ప్రీ స్కూల్ పిల్లలకు రూ.1.85 పైసలు, గ్యాస్‌కు రూ.50 పైసలు ఇస్తున్నారు. ఇవి ఏ మాత్రం సరిపోవడం లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు గగ్గోలు పెడుతున్నారు. ప్రస్తుతం కూరగాయల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. నిత్యవసరాల ధరలు సైతం నింగికి ఎగబాకుతున్నాయి. ఈ కేంద్రంలో 22 మంది పిల్లలకు వండి వడ్డించాలంటే అదనపు భారం తప్పడం లేదు. రూ.900తో గ్యాస్ వేయించుకుంటే 2 నెలలు వస్తుండగా ప్రభుత్వం నుంచి మాత్రం రూ.250 మాత్రమే బిల్లు వస్తుంది. అలాగే వంటకు రెండు నెలలకు సుమారు రూ.1000 ఖర్చు అవుతుండగా ప్రభుత్వం నుంచి కేవలం రూ.400 నుంచి 500 మాత్రమే వస్తుంది. మిగిలిన భారం అంగన్‌వాడీ కార్యకర్తలపైనే పడుతోంది. ఇదే పరిస్థితి అన్ని కేంద్రాల్లోనూ నెలకొంది.



కాకినాడ జిల్లా పరిధిలోని 10 ప్రాజెక్టుల్లో 1986 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటి పరిధిలోని 1,643 మంది గర్భవతులు, 11,989 మంది బాలింతలు, 6 నెలల నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులు 1,06,949 మంది సేవలు పొందుతున్నారు. ప్రభుత్వ మెనూ ప్రకారం గర్భిణులు, బాలింతలు, 3 సంవత్సరాల లోపు పిల్లలకు ఇంటికే పౌష్టికాహారం కిట్లను అందజేస్తున్నారు. 3 నుంచి 6 వరకు వయస్సు ఉన్న చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం నుంచి శనివారం వరకు అన్నం, పులిహోర, ఎగ్ ఫ్రైడ్ రైస్, వెజిటబుల్ రైస్, దోసకాయ, టమోటా, ఆకుకూర, బీరకాయ, సొరకాయ, మునగాకు, పాలకూర, పప్పు, కూరగాయలతో పాటు సాంబారు, 100 మి.లీ. కాచిన పాలు అందిస్తారు. ప్రస్తుతం వర్షాకాలం వలన కాచిన నీళ్లు అందజేస్తున్నారు. అయితే కేంద్రాలకు సరఫరా చేస్తున్న కోడిగుడ్లు కనీసం 50 గ్రాములు ఉండాలన్న నిబంధన ఉంది. అయితే అనేక కేంద్రాలకు సరఫరా చేస్తున్న గుడ్లు 30 నుంచి 35 గ్రాముల్లోపే ఉంటున్నాయని లబ్ధిదారులు తెలిపారు.

సరిపడని కేటాయింపులు

బియ్యం, పప్పులు, ఆయిల్ ప్రభుత్వమే అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్నా కూరగాయలు, తాలింపు సామాన్లు, గ్యాస్, రవాణా ఖర్చుల కోసం ఒక్కొక్కరికి ప్రభుత్వం ఇచ్చేది అరకొర గానే ఉంటుంది. కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. చింతపండు, తాలింపులకు ఉపయోగించే ఎండుమిర్చి, కారం, ఉప్పు, జీలకర్ర, వెల్లుల్లి తదితర వస్తువులు ధరలు ఎక్కువయ్యాయి. గ్యాస్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. పౌష్టికాహారం కోసం ప్రభుత్వం కేటాయిస్తున్న సొమ్ములు ఏమాత్రం సరిపోవటం లేదని అదనంగా ఖర్చులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పౌష్టికాహారం గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు అందని ద్రాక్షలా మారింది.

మెనూ ఛార్జీలు పెంచాలి



కేంద్రాలకు వచ్చే పిల్లలకు పౌష్టికాహారం అందించాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం ఇస్తున్న అరకొర సొమ్ములు సరిపోవటం లేదు. మాపై అదనపు భారం పడుతుంది. నిత్యం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలను పెంచాలి. అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి కృషి చేయాలి.

ఇ.చంద్రావతి, జిల్లా కార్యదర్శి
ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

ప్రజాశక్తి - యంత్రాంగం

యు.కొత్తపల్లి ఎన్నికల హామీయిన రైతుకు రూ.30 వేల పెట్టుబడి సాయాన్ని తక్షణమే ఇచ్చేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి గుర్రాల అప్పారెడ్డి కోరారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ధర్నా అనంతరం తహశీల్దార్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా అప్పారెడ్డి మాట్లాడుతూ కౌలు రైతులకు రైతుల సంతకంతో పని లేకుండా గుర్తింపు కార్డులు ఇచ్చి పెట్టుబడి సాయంగా బ్యాంకు రుణాలు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. వ్యవసాయ కూలీలకు, ఉపాధి హామీ పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు కె.రాముడు, జివి.సుబ్బారెడ్డి, సిహెచ్.నారాయణరెడ్డి, సిఐటియు మండల కార్యదర్శి కాళ్ళ నాగేశ్వరరావు, గుర్రాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు కౌలు రైతుల సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు వళ్ల రాజబాబు, టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఖరీఫ్ సాగు చేస్తున్న రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో కౌలు గుర్తింపు కార్డులకు భూ యజమాని సంతకం తప్పనిసరి చేశారని, దాని వలన కౌలు రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా ప్రభుత్వం కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పెట్టుబడి సాయం, బ్యాంకు రుణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు కౌలు రైతులకు అమలయ్యేలా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుప్పి అదృష్టదీపుడు, గోడి భాస్కరరావు, పాలెపు ఈశ్వరరావు, వి.సత్యనారాయణ, సిహెచ్.సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



తాళ్లరేవులో వినతిపత్రం ఇస్తున్న నాయకులు



యు.కొత్తపల్లిలో వినతిపత్రం ఇస్తున్న అప్పారెడ్డి

పిఠాపురం రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.సింహాచలం కోరారు. రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు స్థానిక ఎంపిడిఒ కార్యాలయ కార్యనిర్వాహణాధికారి ఎం.కృష్ణవేణికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను తక్షణమే పరిష్కరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధి హామీ కూలీలకు బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు రుద్రవరపు భూలోకం, కాలదారి రాఘవ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఊబ బుల్లబ్బాయి పాల్గొన్నారు.

బొద్దవరంలో పశువైద్య శిబిరం

ప్రజాశక్తి - కోటనందూరు

బొద్దవరం గ్రామంలో గురువారం పశుసంవర్ధక శాఖ, పశుగణన అభివృద్ధి శాఖ సంయుక్తంగా పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తుని పశు సంవర్ధక శాఖ సహాయక సంచాలకులు వడ్డీ శ్రీధర్, కోటనందురు, పి.కొట్టం పశు వైద్యులు రత్నతేజ, ప్రదీప్‌కుమార్ గర్భకోస, చూడి, ఎదకురాని 77 పశువులకు వైద్య పరీక్షల నిర్వహించారు. రాష్ట్రీయ గోకుల మిషన్ ఆర్థిక సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు డాక్టర్ రత్నతేజ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వేగి అప్పలనాయుడు, ఎంపిటిసి సభ్యులు లగుడు వరలబాబు, మాజీ సర్పంచ్ ఎల్లప్ప వెంకటరమణ, హడారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



గేదెలకు వైద్య సేవలు అందిస్తున్న పశుసంవర్ధక శాఖ వైద్యులు

ఆదిత్య విద్యార్థినికి గోల్డ్ మెడల్

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య డిగ్రీ కళాశాల ఫోరెన్సిక్ సైన్స్ విద్యార్థిని గాలి అఖిల సంజన ట్రయాథలాస్ మహిళ జూనియర్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించింది. కాకినాడ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ క్రీడా మైదానంలో జరిగిన 8వ రాష్ట్రస్థాయి మోడరన్ పెంటాథలాన్, ట్రయాథలాన్, బయాథలాన్ ఛాంపియన్షిప్- 2024 పోటీలలో ఆమె ఈ మెడల్‌ను సాధించింది. ఉత్తరాఖాండ్‌లో జరగబోయే నేషనల్ క్రీడలకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా మోడరన్ పెంటాథలాన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, డిఎస్‌డిఒ బి.శ్రీనివాసకుమార్ గోల్డ్ మెడల్ బహుకరించారు. ఈ సందర్భంగా ఆదిత్య విద్యాలయాల ఛైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి కళాశాల ప్రిన్సిపల్ విలాస్‌అనిల్‌చవాన్, ఆమెకు అభినందనలు తెలిపారు.



గోల్డ్‌మెడల్ అందుకుంటున్న విద్యార్థిని సంజన

ఎస్‌విఆర్‌కు భారతరత్న ఇవ్వాలి

కాకినాడ రూరల్ : విశ్వ నట చక్రవర్తి ఎస్‌వి రంగారావుకి భారతరత్న ఇవ్వాలని ఆంధ్ర కాపు సద్భావన సంఘం అధ్యక్షులు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి, కాపు జెఎసి కన్వీనర్ వాసిరెడ్డి ఏసుదాసు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక నాగమల్లి తోట ఎస్‌వీఆర్ జంక్షన్ వద్ద ఎస్‌వీఆర్ 50వ వర్ధంతిని నిర్వహించారు. ఎస్‌వీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏసు దాసు మాట్లాడుతూ ఎస్‌వీఆర్ చనిపోయినా ప్రజల హృదయాల్లో చిరస్మరణీయులుగా ఉండిపోయారని అన్నారు. అటువంటి మహనీయుడిని ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం గుర్తించి భారతరత్న ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర కాపు సద్భావన సంఘం ప్రతినిధులు వినాయక మాధవరావు, సలాది మూర్తి, అడపా ప్రకాష్ నాయుడు, మాధవరపు పట్టాభి రామయ్య, చినబాబు పాల్గొన్నారు.

నారుమళ్లను సంరక్షించుకోవాలి

ఏలేశ్వరం : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నారుమడులను సంరక్షించుకోవాల్సిన అవసరం రైతులకు ఎంతైనా ఉందని ఎఒ బి.జ్యోతి అన్నారు. 3 రోజుల కంటే ఎక్కువగా నారుమడి నీట మునిగితే వీలైనంత త్వరగా నీటిని బయటికి తీసివేయాలన్నారు. విత్తనం చల్లిన ఐదు రోజుల నుంచి 30 రోజుల నారు మడి ఐదు రోజులపాటు నీట మునిగితే వెంటనే నీటిని తీసివేసి ఐదు సెంట్ల నారు మడికి ఒక కిలో యూరియా, ఒక కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ చల్లాలన్నారు. నారుమడి దశలో పంట తెగుళ్ల బారిన పడకుండా నీరు పూర్తిగా తీసేసిన తరువాత లీటర్ నీటికి ఒక గ్రాము కార్బండిజం లేదా రెండు గ్రాములు కార్బండిజం మాంకోజెబ్ మిశ్రమం కలిపిన నీటిని పిచికారీ చేయాలన్నారు.

నిబంధనలు ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్లు సీజ్

ప్రజాశక్తి - కాకినాడ

నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ సెంటర్లను సీజ్ చేస్తామని కలెక్టర్ షాన్ మోహన్ హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్ కోర్టు హాలులో పిసి, పిఎన్‌డిటి చట్టం అమలుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్ట్రా స్కానింగ్ సెంటర్‌లు అక్రమ గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలకు చేసి ప్రజల వద్ద నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని సమాచారం ఉందని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు కేసు నమోదు చేసి స్కానింగ్ సెంటర్లను క్లోజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని స్కానింగ్ సెంటర్లపై డెకాయట్ ఆపరేషన్లతో రహస్య నిఘా మరింత విస్తృతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లాలో కొత్తగా 3 ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్ ఏర్పాటుకు అనుమతి, ఆరు సెంటర్ల రిజిస్ట్రేషన్ రెన్యూవల్ కొరకు అందిన ధరఖాస్తులపై క్షేత్రాధికారుల పరిశీలన నివేదికలను సమీక్షించి కమిటీ ఆమోదం తెలిపింది. అలాగే సెంటర్ల చిరునామా, యంత్రాలు, సిబ్బందికి సంబంధించిన మార్పులు, సెంటర్ల మూసివేతకు అనుమతి కోరుతూ అందిన 8 ధరఖాస్తులకు అంగీకారం జారీ చేసింది. జిల్లా మూడవ అడిషనల్ జిల్లా జడ్జి పి.కమలాదేవి మాట్లాడుతూ పిసి అండ్ పిఎన్‌డిటి యాక్ట్‌ను ప్రతిష్టంగా అమలు చేయాలని ఆమె సూచించారు. ఎక్కడ డివేషన్ లేకుండా ఈ యాక్ట్‌ను అమలు చేసి అక్రమ లింగ నిర్ధారణ పరీక్షలు కాకుం డా చర్యలు చేపట్టాలని ఎక్కడైనా జరిగినట్లయితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జడ్జి సూచించారు. ఈ సమావేశంలో జెసి ఎస్.రామ్ సుందర్‌రెడ్డి, డిఎంహెచ్ఒ డాక్టర్ జె.నరశింహ నాయక్, దిశ డిఎస్‌పి ఆర్.రామచంద్రరావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ ఎస్.స్వప్న, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ పి.సరితా, జిజిహెచ్ రేడియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కెఎస్.సునీత, గైనోకాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.ఉషశ్రీ, ఐవిఎఫ్ సెంటర్ వైద్యులు డాక్టర్ ఎస్.నందీశ్వరి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కె.వెంకటేశ్వరరావు(చేంజెస్), పి.చక్రవర్తి (నీడ్), ఎస్.అప్పల నాయుడు (ఉమా మనోవికాశకేంద్రం) పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్



పిఠాపురంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయమూర్తి, న్యాయవాదులు, పోలీసులు

హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలి

ప్రజాశక్తి - పిఠాపురం, పెద్దాపురం

ద్విచక్రవాహనదారులు ప్రయాణం చేసే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్‌ను వాడాలని 12వ అదనపు జిల్లా జడ్జి వాసంతి పిలుపునిచ్చారు. గురువారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో హెల్మెట్ ధరించడంపై వన్-కె అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక జిల్లా కోర్టుల ప్రాంగణం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా చర్చి సెంటర్ వరకు సాగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ వాహనదారులు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి వాహన రికార్డులు సక్రమంగా ఉండే విధంగా చూసుకోవాలని, ఇన్సూరెన్స్ ప్రతి ఒక్క వాహనదారుడు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు, జూనియర్ ప్రిన్సిపల్ జడ్జి ఎం.విజయరామేశ్వరి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.రాజారావు, ఉపాధ్యక్షులు ఎస్‌ఎం.ఆలీ, ఇతర న్యాయవాదులు, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పెద్దాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం హెల్మెట్ ధరించడం - మోటారు వాహనాల చట్టంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక మహారాణి కళాశాల వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ మున్సిపల్ సెంటర్ వరకు కొనసాగింది. అనంతరం మున్సిపల్ సెంటర్లో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ వై.రవికుమార్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.హరినాథ రెడ్డి, మహారాణి కళాశాల ప్రిన్సిపల్ జి.జ్యోతిర్మయి, న్యాయవాదులు ఎం.రాంబాబు, వల్లి బాబు, పి.చిన చంటి, ఎస్.విశాలాక్షి, సోషల్ వర్కర్ ఎన్.అప్పలకొండ, వాలంటీర్లు బిఎస్‌ఎన్.మూర్తి, రెహమాన్, లక్ష్మి, పోలీసులు, కళాశాల, ఆర్‌టిఒ సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్యాలు అప్రమత్తం కావాలి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను తరలించే వాహనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఎన్.రామకృష్ణ అన్నారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ప్రయివేట్ పాఠశాల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వాహనాలు ఏర్పాటు చేయడంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించరాదని తెలిపారు. పాఠశాలకు తీసుకువచ్చే విద్యార్థిని తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యం వారికి అవగాహన కల్పించాలన్నారు. వాహనాలకు అన్ని అనుమతులు ఉండాలని, ఆటోలపై ఇష్టానుసారంగా విద్యార్థులను పాఠశాలకు తరలించే విధంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ చంద్రశేఖర్, ప్రయివేటు విద్యా సంస్థల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

శివారు పొలాలకు సైతం సాగునీరు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేరు ఆయకట్టు శివారు పంట పొలాలకు సైతం నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్ఎ వరుపుల సత్య ప్రభ అన్నారు. గురువారం ఏలేరు ఆయకట్టులో భాగమైన 6500 ఎకరాలకు నీరు అందిస్తున్న తిమ్మరాజు చెరువుకు కొక్కిర గడ్డ కాలువ ద్వారా ఏలేరు రిజర్వాయర్ జలాలను అందించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సత్యప్రభ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నీటిపారుదల పూర్తిగా నిర్వీర్యం అయ్యిందన్నారు. గత వారం రోజులుగా యుద్ధ ప్రాతిపదికన తిమ్మరాజు చెరువు ఆయకట్టు కాలువలు పూడిక తీత పనులు నిర్వహిస్తున్నామన్నారు. తిమ్మరాజు చెరువుకు రోజు100 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఆమె అధ్వాన స్థితిలో ఉన్న రమణయ్యపేట, జె.అన్నవరం ఆర్ అండ్ బి రహదారిని పరిశీలించారు. సంభధిత ఆధికారులను తక్షణమే రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జి.బుజ్జి, మాజీ జడ్‌పిటిసి జె.పెదబాబు, జనసేన ఇన్‌ఛార్జ్ వి.తమ్మయబాబు, నాయకులు బి.గోపి, మూదినారాయణస్వామి, పి.మోహన్ పాల్గొన్నారు.



పూజ చేస్తున్న ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ



ఆన్‌లైన్ సభ్యత్వాన్ని ఇస్తున్న ఎంఎల్ఎ




పెద్దాపురంలో మాట్లాడుతున్న రామస్వామి

జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం, కాకినాడ రూరల్

పట్టణంలో జనసేన క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమం జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదవశాత్తు మృతి చెందిన జనసేన కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షలు ఆర్థిక సహాయం అందజేయబడుతుందన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రతి కార్యకర్త క్రియాశీల సభ్యత్వాలు ముమ్మరంగా చేయించాలన్నారు. జిల్లా పరిధిలో ఎక్కువ సభ్యత్వం చేయించిన కార్యకర్తలకు ప్రోత్సాహకంగా తన సొంత నిధులు రూ.10 వేలను అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షులు పొలమరశెట్టి సత్తిబాబు, నాయకులు సరోజ వాసు, ఒబిలిశెట్టి గణేష్, కటారి శ్రీను, పిట్టా జానకి రామారావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే కాకినాడ రూరల్‌లో ఎంఎల్ఎ పంతం నానాజీ నగరంలోని గోడారిగుంటలో జనసేన కార్యాలయంలో సభ్యత నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో కాకినాడ రూరల్ నియోజకవర్గాన్ని అగ్ర స్థానంలో నిలపాలని సూచించారు. సభ్యత్వం ద్వారా కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. నియోజకవర్గంలోని ప్రతి జనసైనికుడు/వీర మహిళా సభ్యత్వ నమోదు చేసుకుని బీమా సదుపాయం పొందాలని చెప్పారు.అలాగే సర్పవరం జంక్షన్‌లో జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జనసేన కాకినాడ శాఖ ఉపాధ్యక్షులు అడబాల సత్యనారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, ఎస్.శ్రీ నగేష్, తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



వర్షంతో జలమయం



వర్షాలతో నీట మునిగిన వరి పొలాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలో పలుచోట్ల ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తుంది. గత వారం రోజులుగా పడుతున్న వర్షానికి పలుచోట్ల పంట పొలాలు నీట మునిగాయి. లోతట్టు ప్రాంతాలు సైతం జలమయమవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కోరంగి పంచాయతీ సీతారామపురం, తాళ్లరేవు పంచాయితీ మెయిన్ రోడ్డుపై చెరువుగట్టు సెంటర్ ప్రాంతం, పరదేశమ్మ వీధి, సుంకరపాలెం బైపాస్ జంక్షన్, సుంకరపాలెం జంక్షన్ నుంచి ఇంజరం వైపు వెళ్లే గుంతలు పడిన ప్రధాన రహదారి లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

లీకేజీలకు మోక్షం ఎప్పుడో..?

- కలుషితమవుతున్న త్రాగునీరు
- అనారోగ్య పాలవుతున్న ప్రజలు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

నాగులపల్లి రక్షిత మంచినీటి పథకం ద్వారా సరఫరా చేస్తున్న తాగునీరు పైపులైన్లు లీకులతో కలుషతమౌతుంది. కలుషితమైన తాగునీటిని వినియోగించిన ప్రజలు రోగాల భారిన పడుతున్నారు. ఎండపల్లి జంక్షన్ సమీపం వద్ద ఉన్న ప్రధాన పైపులైను లీకేజీ కావడంతో అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. చేసిన మరమ్మతులను నాణ్యతతో చేపట్టకపోవడంతో లీకేజీలు సరా మామూలే అన్నట్లుగా పరిస్థితి మారింది. అయితే తక్షణమే స్పందించాల్సిన అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో తాగునీరు వృధా కావడంతో పాటు, కలుషితమైన నీటినే ప్రజలు వినియోగించక తప్పడం లేదు. దీంతో ప్రజలు రోగాల భారిన పడుతున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రయివేట్ ఆసుపత్రులతోపాటు, పిఎంపి వైద్యుల వద్దకు రోగులు భారులు తీరుతున్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో వాతావరణలో వచ్చిన మార్పులతోపాటు, కురుస్తున్న వర్షాలతో వైర జ్వరాలు, డయేరియా, టైఫాడ్ వంటి వ్యాధులు ప్రభలుతున్నాయి.



లీకేజీ నుంచి వృధాగా పోతున్న తాగునీరు

అయినా సంబంధిత ఆర్ డబ్ల్యు ఎస్ అధికారుల్లో చలనం కన్పించడం లేదు. కలుషితమైన తాగునీరు సరఫరా అవుతుండటంతో ప్రజలు ప్రయివేటు ఆర్ఒ ప్లాంట్ల నుంచి తాగునీరు కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకుంది. పాడైన పైపులైన్‌కు నాణ్యతతో కూడిన మరమ్మతులు చేపట్టినట్లు అయితే తమకు ఈ పరిస్థితి దాపురించేది కాదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రజల ఆరోగ్యాలు కాపాడే విధంగా లీకేజీ అయిన పైపులైన్‌కు తక్షణమే మరమ్మతులు చేపట్టిలే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి, శంఖవరం

శంఖవరంలో గురువారం విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కోన లోవకుమార్(35) ఎప్పటిలానే మేకలకు మేత నిమిత్తం పచ్చిరొట్టను తెచ్చేందుకు వెళ్లాడు. సమీపంలోని పామాయిల్ తోటలో రొట్టను కోస్తున్నాడు. ఈ సమయంలో పామాయిల్ మట్ట తెగి విద్యుత్ తీగలపై పడింది. అదుపుతప్పి లోవకుమార్ కత్తి విద్యుత్‌తీగలను తాకింది. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లోవకుమార్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని కుటుంబాన్ని టిడిపి నాయకులు పర్వత సురేష్ పరామర్శించారు. ఎంఎల్‌ఎతో మాట్లాడి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట బొర్రా వాసు, జట్లా శ్రీను, రౌతు శ్రీను, కె.కృష్ణారావు, కె.సత్తిబాబు, ఎస్.సత్తిబాబు, కోన కొండబాబు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట మండలం హుస్సేన్‌పురం గ్రామం కెనాల్ రోడ్‌లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని జి.మేడపాడుకు చెందిన గోనుపూడి రాజు(29) మతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు సామర్లకోటలో బ్యాంకు పని నిమిత్తం జి.మేడపాడుకు చెందిన రాజు ఇద్దరు మహిళలతో స్కూటీపై గురువారం వచ్చాడు. అనంతరం జి.మేడపాడుకు తిరుగుపయనమయ్యారు. కెనాల్‌రోడ్డుపైకి వచ్చే సరికి వెనుక నుంచి లారీ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన వారిని 108లో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ వి.మౌనిక తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం

తాళ్లరేవు : బాలలు, మహిళల చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ సూపర్ వైజర్ ఎస్‌బి.మాణిక్యాంబ అన్నారు. ఇంజరంలో గురువారం బాలల, మహిళల హక్కులు, చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మహిళలు, బాలల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కఠినంగా శిక్షించేలా చట్టాలున్నాయన్నారు. పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కోట శ్రీధర్, అంగన్‌వాడీలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో నారుమళ్లకు రక్షణ

కాజులూరు : వెదజల్లే విధానంలో జాగ్రత్తలు పాటిస్తే వర్షాల నుంచి నారుమడి ని రక్షించుకోవచ్చని ఎఒ ఎ.అశోక్ తెలిపారు. గురువారం కాజులూరు తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. కొద్దిరోజులగా కురుస్తున్న వర్షాలకు పలుచోట్ల వరిపంట నష్టాలకు గురైందన్నారు. వీలైనంత తొందరగా నారుమళ్లలో నీటిని పూర్తిగా బయటకు తీసివేయడం వల్ల నష్టం నుంచి బయటపడే అవకాశం ఉందన్నారు. 5 రోజుల కన్నా ఎక్కువగా నీట మునిగితే నారు దెబ్బతినే అవకాశం ఉందన్నారు.

జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభం

కరప : జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు గురువారం నుంచి ప్రారంభమైంది. కాకినాడ రూరల్ ఎంఎల్‌ఎ పంతం నానాజీ ఈ కార్యక్రమాన్ని గొడారిగుంట ఎంఎల్‌ఎ కార్యాలయంలో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో రూరల్ నియోజకవర్గాన్ని అగ్ర స్థానంలో నిలపాలని కోరారు. సభ్యత్వం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. నమోదులో ఏవైనా ఇబ్బందులుంటే హెల్ప్ లైన్ లేదా కాకినాడ రూరల్ ఎంఎల్‌ఎ కార్యాలయ సిబ్బంది దృష్టికి తీసుకురావాలన్నారు.

పేదరికం లేని గ్రామాల సాధనకు కృషి

సామర్లకోట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల ద్వారా రాష్ట్రంలో పేదరికం లేని గ్రామాలను సాధించేందుకు జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక మోడల్ ప్లాన్‌ల తయారీ ద్వారా కృషి చేయాలని సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ పిలుపునిచ్చారు. సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రంలో పూర్వపు ఉభయ గోదావరి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు సంబంధించి 11 జిల్లాల జిల్లా స్థాయి అధికారులకు థీమ్-1పై బ్యాచ్‌ల వారీ మూడు రోజుల శిక్షణా కార్యక్రమాలు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వేణుగో పాల్ మాట్లాడారు. ఈ శిక్షణలో 11 జిల్లాలకు చెందిన జెడ్‌పి సిఇఒలు, డిఆర్‌డిఎ పీడీలు, డిఎల్‌పిఒలు, డిపిఒలు, డ్వామీ పీడీలు, సోషల్ వెల్ఫేర్, బిసి వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు. వైస్ ప్రిన్సిపల్ ఇ.కృష్ణమోహన్, ఫ్యాకల్టీలు జివి.శ్రీదేవి, పి.శ్రీనివాస రావు, వి.ప్రసాద్ తదితరులు వారికి శిక్షణ నిచ్చారు.

తణుకురాజుకు ఘన నివాళి

తాళ్ళరేవు : ఇటీవల మృతి చెందిన వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు మందనక్క తణుకు రాజుకు ప్రజా సంఘాల నాయ కులు ఘనంగా నివాళు లర్పించారు. గురువారం తణుకు రాజు దినకార్యం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు, తదితరులు తణుకురాజు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ లర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నేరేడుమిల్లి త్రిమూర్తులు, బీర వెంకటేశ్వర్లు, దుప్పి అదృష్టదీపుడు, విప్పర్తి శ్రీనివాస్, పులపకూర కృష్ణ, గోడి భాస్కరరావు, పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

కాకినాడ రూరల్ : కొండయ్యపాలెం శారదా దేవి గుడికి వెళ్లే నాలుగు రోడ్ల జంక్షన్‌లో శ్రీకష్ణ దేవరాయల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కాపు జెఎసి రాష్ట్ర అధ్యక్షులు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పేర్కొన్నారు. ఈ మేరకు వాసిరెడ్డి దాసు ఆధ్వర్యంలో ఎంఎల్‌ఎ పంతం నానాజీకి గురువారం వినతిపత్రం అందించారు. దీనిపై నానాజీ సానుకూలంగా స్పందించారు. విగ్రహ ఏర్పాటుకు సహకరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రంగా మిత్ర మండలి సభ్యులు, ఆంధ్ర కాపు సద్భావన సంఘ సభ్యులు, శ్రీకష్ణదేవరాయల అభిమానులు పాల్గొన్నారు.

రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -కరప

రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.రాజశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం తహశీల్దార్ కోటేశ్వరరావుకు, మండల ప్రజా పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌లకు వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కౌలు రైతు సంఘాల పోరాట ఫలితంగా వచ్చిన కౌలు చట్టాన్ని గత వైసిపి ప్రభుత్వం మార్చి వేసిందన్నారు. దీంతో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు రాక, బ్యాంకు రుణాలు అందక అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. టిడిపి ప్రభుత్వం ఆ చట్టాన్ని రద్దుచేసి ప్రతి కౌలు రైతుకూ గుర్తింపు కార్డు ఇచ్చి, బ్యాంకు రుణాలు అందించాలన్నారు. సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలను వెంటనే అందించాలన్నారు. మే, జూన్ నెలలో చేసిన ఉపాధి హామీ కూలీలకు వెంటనే బకాయి కూలి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చోడిశెట్టి కృష్ణ, కౌలు రైతు సంఘ నాయకులు వాసంశెట్టి అప్పారావు, ఎస్.గణపతి, వై.కృష్ణ, పి.ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న రాజశేఖర్, శ్రీనివాస్ తదితరులు

అటానామస్‌గా పైడా ఇంజినీరింగ్ కళాశాల

ప్రజాశక్తి - తాళ్లరేవు

పైడా ఇంజనీరింగ్ కళాశాలకు అటానమస్ గుర్తింపు వచ్చినట్లు పైడా గ్రూపు విద్యాసంస్థల ఛైర్మన్ పైడా సత్యప్రసాద్, ఎండి, సెక్రటరీ పైడా సత్యశ్రీరామ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరం నుంచి 2033-34 వరకు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ న్యూఢిల్లీచే అటానమస్ స్టేటస్ (స్వయంప్రతిపత్తి గల సంస్థ)గా నిర్ధారిస్తూ ఈ నెల 17వ తేదీన ధ్రువీకరణ పత్రం జారీ చేశారని అన్నారు. కళాశాల అభ్యున్నతికి సహకరించిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి యాజమాన్యం తరుపున కృతజ్ఞతలు తెలిపారు. 1953లో ద్రాక్షరామంలో ఉన్నత పాఠశాలగా తమ పూర్వీకులు ప్రారంభించిన విద్యా సంస్థ నేడు 4 వేలకుపైగా విద్యార్థులు, 30కి పైగా కోర్సులు, కాకినాడ, పటవల, ద్రాక్షారామంలలో దిగ్విజయంగా నిర్వహిస్తున్నామన్నారు. రెండు నెలల క్రితం ఫార్మసీ మరియు ఇంజనీరింగ్ కళాశాలలు రెండింటికీ నేషనల్ అక్రిడిటేషన్ అండ్ అసెస్మెంట్ కౌన్సిల్ న్యూఢిల్లీ చే 'ఏ గ్రేడ్ ' మంజూర య్యిందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచే స్వయంప్రతిపత్తి గుర్తింపును మంజూరు చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

కుష్ఠు నిర్మూలనకు చర్యలు

కాకినాడ : జిల్లాలో కుష్టువ్యాధిని పూర్తిగా నిర్మూలిం చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ షాన్ మోహన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో కుష్టువ్యాధి నిర్మూలన చర్యలకు సంబంధించి వివిధ శాఖలతో సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కుష్టువ్యాధి వ్యాప్తికి కారణాలను గుర్తించి, వాటిని నివారించాలన్నారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా ఈనెల 18 నుంచి ఆగస్టు 2 వరకు జిల్లాలో ఇంటింటి సర్వే నిర్వహిస్తామన్నారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం ద్వారా వ్యాధిని చాలావరకు అరికట్టొచ్చన్నారు. ఈ సమావేశంలో 3వ అడిషనల్ జిల్లా జడ్జి పి.కమలాదేవి, జెసి ఎస్.రామసుందర్‌రెడ్డి, డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ జె.నరసింహనాయక్, జిల్లా కుష్టు వ్యాధి నియంత్రణాధికారి డాక్టర్ ఆర్.రమేష్, జిల్లా పౌరసంబంధాల అధికారి డి.నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

రసాబాసగా పంచాయతీ సమావేశం

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి సచివాలయంలో గురువారం జరిగిన పంచాయతీ సమావేశం రసాబాసగా మారింది. పంచాయతీ కార్యదర్శి డిఎస్ఎన్.రెడ్డి సర్పంచ్ రత్తుల లలిత ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. తొలుత ఏడుగురు వార్డు సభ్యులు మాత్రమే వచ్చారు. తీర్మానాలకు సంబంధించిన మాట్లాడకుండానే సమావేశాన్ని ముగించేశారు. అనంతరం మరి కొంతమంది వార్డు సభ్యులు వచ్చారు. అప్పటికే సమావేశాన్ని ముగించడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ వార్డు సభ్యులు సమావేశానికి మినిట్స బుక్స్‌లో సంతకాలు చేసి వ్యక్తిగత పనులపై వెళ్లిపోయారని తెలిపారు. తాము రాకుండానే సమావేశాన్ని ముగించడంపై టిడిపి సభ్యులు వాగ్వాదానికి దిగారు. దీనిపై ఆయన స్పందించి సర్పంచ్‌కు ఫోన్ చేశారు. వ్యక్తిగత పనుల వల్ల రాలేనని చెప్పారు. మరోసారి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. నేటి సమావేశంలో ఎలాంటి తీర్మానం జరుగలేదని తెలిపారు. దీనిపై టిడిపి నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలపై నిలదీస్తామని తెలుసుకుని ముందుగా వచ్చి సంతకాలు చేసి వెళ్లిపోయారన్నారు. ఇది సరైన మద్దతి కాదని ఎలమాటి కాశీ అన్నారు.

ముంపు ప్రాంతాల పరిశీలన

తాళ్లరేవు : ఎడతెరిపిలేని వర్షం వల్ల జలమయమైన పల్లపు ప్రాంతాలను ముమ్మిడివరం ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సుంకరపాలెం బైపాస్ లో కూడలిలో మెయిన్ రోడ్డుపై వర్షపు నీరు నిలిచి ప్రయాణాలకు తీవ్ర ఆటంకం కలుగుతుందని టిడిపి నాయకులు మోపూరి వెంకటేశ్వరరావు ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకెళ్లారు. వ్యాపార సముదాయాలు వద్ద నీరు నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతుందని తెలిపారు. సుంకరపాలెం జంక్షన్ నుంచి పంచాయతీ కార్యాలయం వరకు ప్రధాన రహదారి గుంతలతో ప్రమాదకరంగా మారిందన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆర్ అండ్‌బి డిఇ ఎన్‌హెచ్ 216 అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వేగేశ్న భాస్కరరాజు, చీకట్ల నాగేశ్వరరావు, సుంకర చంద్రం, వర్తక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

జిజిహెచ్ రిటైర్డ్ ఎంఎన్‌ఒ మృతికి సంతాపం

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ జిజిహెచ్ రిటైర్డ్ ఎంఎన్‌ఒ భూపతి అప్పారావు మృతికి సిఐటియు, ఇతర ప్రజా సంఘాలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశాయి. సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షురాలు జి.బేబిరాణి, జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి, సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకటరమణ, సహాయ కన్వీనర్ పలివెల వీరబాబు, జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు సిహెచ్. విజయ్‌కుమార్, జె.శేషు, జిజిహెచ్ మెస్ వర్కర్స్ యూనియన్ నాయకులు వై.శంకర్, ఏడుకొండలు యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిజిహెచ్ బ్రాంచ్ నాయకులు డి.పుష్పరాగం, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు బంగారు సత్తిబాబు టాటా మ్యాజిక్ వాహన డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు వాలిశెట్టి శ్రీనివాస్ సంతాపం ప్రకటించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - పెద్దాపురం, సామర్లకోట

మండలానికి చెందిన దివిలి విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా ఈనెల 19వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందనిఎపి ఇపిడిసిఎల్ పెద్దాపురం ఇఇ ఎవిఎస్‌డిఎస్.ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చదలాడ, ఉలిమేశ్వరం, కాంద్రకోట, గుడివాడ, సిరివాడ, మరలావ, తూర్పుపాకలు, తిరుపతి, తాటిపర్తి, దివిలి, పులిమేరు, గోరింట, చంద్రమాంపల్లి గ్రామాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. సామర్లకోట రూరల్ విద్యుత్ సబ్‌స్టేషన్ 11 కెవి పవర ఫీడర్ మర్మమతులు కారణంగా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం.1.00 గంట వరకు ఉండూరు, గొంచాల, నవర, పవర, పి వేమవరం, కాపవరం గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపేస్తామని ఇఇ ఎవిఎస్‌డిఎస్.ప్రభాకర్ తెలిపారు. వేట్లపాలెం సబ్‌స్టేషన్లో మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వేట్లపాలెం, జి.మేడపాడు, హుస్సేన్ పురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నిబంధనలు పాటించాలి

ఏలేశ్వరం : వాహనదారులు రహదారి నిబంధనలను తప్పక పాటించాలని ప్రత్తిపాడు కోర్టు న్యాయమూర్తి కాటం భాను సూచించారు. గురువారం ప్రత్తిపాడు న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదులు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి భాను మాట్లాడారు. చిన్నచిన్న తప్పుల వల్ల ప్రయణాల సమయంలో ప్రాణాలు కోల్పోవలసి వస్తుందన్నారు. రోడ్డు ప్రమాదాల్లో యువత ఎక్కువగా మృతి చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బైకులపై వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్లు ఇతర వాహనాల్లో సీట్ బెల్ట్ వినియోగించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎ.కుక్కుటేశ్వరరావు, బి.మధుబాబు, ఆర్.వెంకట్రావు, జె.రాజేష్, మాజీ అధ్యక్షుడు బుగతా శివ పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూల నిర్వహణ

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లా పరిధిలో జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పొరుగు సేవలు (అవుట్‌సోర్సింగ్) విధానంలో 8 కేటగిరీలలో తొమ్మిది పోస్టుల భర్తీకి గురువారం స్థానిక కలెక్టరేట్లో జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్ నుపూర్ అజయ్ అధ్యక్షతన ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పోస్టు భర్తీకి 21 మంది దరఖాస్తు చేసుకు న్నారని అన్నారు. అదే విధంగా ఒక ప్రొటెక్షన్ అధికారి పోస్ట్ భర్తీకి (ఇన్స్టిట్యూషనల్‌కేర్)గాను 35 మంది దరఖాస్తు చేసు కున్నారని ఆమె తెలిపారు. అదే విధంగా ఒక ప్రొటెక్షన్ అధికారి (నాన్ ఇన్స్టిట్యూషనల్ కేర్) పోస్టుకుగాను 34 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు అలాగే ఒక కౌన్సిలర్ పోస్టుకు 18 మంది దరఖాస్తు చేసుకున్నారని, రెండు సోషల్ వర్కర్ పోస్టులు భర్తీకి 44 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఒక డేటా ఎనలిస్ట్ పోస్టుకు 28 మంది దరఖాస్తు చేసు కున్నారని, ఒక అసిస్టెంట్ కం డిఈఓ పోస్ట్ భర్తీకి గాను 23 దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. ఒక ఔట్రీచ్ వర్కర్ పోస్టు భర్తీకి 20 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇంటర్వ్యూలు నిర్వహించిన వారిలో ఐసిడిఎస్ పథక సంచాలకులు ఎం.ఝాన్సీరాణి, సిడబ్ల్యుసి ఛైర్‌పర్సన్ పి.సూర్య ప్రభావతి, జువైనల్ జస్టిస్ బోర్డ్ నెంబర్ తబిత, సాంఘిక సంక్షేమ శాఖ ఉపసం చాలకులు పి జ్యోతిలక్ష్మీదేవి ఉన్నారు.

నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

కాకినాడ : ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ తరగతులు నిర్వహిస్తున్న నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. గురువారం నారాయణ కళాశాల ఎదురుగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ నారాయణ కళాశాల యాజమాన్యం తరగతులను నిర్వహిస్తుందన్నారు. విద్యార్థులను మానసికంగా ఇబ్బంది పడేలా యాజమాన్యం ప్రయత్నిస్తుందన్నారు. తక్షణమే నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మణికంఠ, సంజయ్, ఆదర్శ కార్తిక్, జయరామ్, విఫిన్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

కౌలు రైతుల రుణాలపై అవగాహన

కపిలేశ్వరపురం : టేకి రైతు సేవా కేంద్రం వద్ద గురువారం యూనియన్ బ్యాంక్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కౌలు రైతులు రుణాలు, నియమ నిబంధనలు పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ కుమార్, ఎఒ రమేష్ కుమార్ మాట్లాడుతూ సిసిఆర్‌సి కార్డులపై యజమాని సంతకం ఉంటేనే కౌలు రైతులకు రుణం మంజూరు అవుతుందన్నారు . రైతులు దూరంగా ఉన్నట్లయితే ఫోన్ ద్వారా అంగీకారం తెలపాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు హరిబాబు, మేడిశెట్టి వెంకటరమణ ,దాసరి శ్రీనివాస్, వి.సతీష్, రైతులు పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధి పనులకుశంకుస్థాపన

కోటనందూరు : తుని పట్టణంలో మున్సిపల్ పార్కు అభివృద్ధికి ఎంఎల్‌ఎ యనమల దివ్య గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కుడా సహకారంతో రూ.80 లక్షలతో మున్సిపల్ పార్కును అభివృద్ధి చేస్తున్నామన్నారు. పార్కులో కనీస మౌలిక వసతులు లేకపోవడంతో పట్టణ ప్రజల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ అశోక్ బాబు, యనమల రాజేష్, మోత్కూరు వెంకటేష్, చింతమనేడు అబ్బాయి, తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియుకె ఇన్‌ఛార్జ్ విసిగా మురళీకృష్ణ

కాకినాడ : కాకినాడ జవహర్లాల్ నెహ్రూ టెక్నికల్ యూనివర్సిటీ ఇన్‌ఛార్జ్ విసిగా సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ కెవిఎస్‌జి.మురళీకృష్ణను ప్రభుత్వం నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు విసిగా ఉన్న ప్రొఫెసర్ జివిఆర్.ప్రసాద్ రాజు ఉపకులపతి పోస్టుకు రాజీనామా చేయడంతో ప్రభుత్వం ఈ మేరకు మురళీకృష్ణను ఇన్‌ఛార్జ్ విసిగా నియమించింది.

కంటిపూడి కుటుంబానికి పరిమిబాబు పరామర్శ

గండేపల్లి : గండేపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు కంటిపూడి రామయ్య తల్లి బంగారమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆమె భర్త గోవిందు, కుమారులు రామయ్య, సత్యనారాయణ, నరేంద్రలను టిడిపి నాయకులు, సొసైటీ మాజీ అధ్యక్షులు పరిమిబాబు గురువారం పరామర్శించారు. ఆయన వెంట సంకువల్లి రమేష్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

ఆలమూరు : పార్టీలకు అతీతంగా కలసికట్టుగా గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమమే, లక్ష్యంగా పనిచేయాలని పలువురు సర్పంచులు అభిప్రాయపడ్డారు. గుమ్మిలేరులో ఆ గ్రామ సర్పంచ్ గుణ్ణం రాంబాబు అధ్యక్షతన గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సర్పంచ్ రాంబాబు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు టి.శ్రీనివాస్, కట్టా శ్రీనివాసరావు, వై.సత్యశ్రీ మెహర్ ప్రసాద్, కె.శ్రీను పాల్గొన్నారు.

శ్రీమన్నారాయణకు డాక్టరేట్

ముమ్మిడివరం రూరల్ : భౌతిక శాస్త్రంలో కోలా శ్రీమన్నారాయణకు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు గీతం విశ్వవిద్యాలయం నుంచి ఉత్తర్వులు అందినట్లు డాక్టరేట్ ఆయన తెలిపారు. గేదెల్లంక గ్రామానికి చెందిన శ్రీమన్నారాయణ నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో భౌతిక శాస్త్ర అధ్యాపకునిగా పని చేస్తున్నారు. మెటీరియల్ సైన్స్‌లో పరిశోధనలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

30వ రోజుకు రాక్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి -సామర్లకోట

అక్రమంగా తొలగించిన తమను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాక్ సిరామిక్స్ గేటు ముందు సిఐటియు ఆధ్వర్యంలో రాక్ సిరామిక్స్ కార్మికులు చేపట్టిన నిరసన సోమవారం నాటాకి 30వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులు చంద్రశేఖర్, వరప్రసాద్, మంగారావులు మాట్లాడుతూ కార్మికులను విధుల నుంచి తొలగించి 94 రోజులైందన్నారు. పోరాటం ప్రారంభించి 30 రోజులైందన్నారు. అయినా యాజమాన్యం స్పందించకపోవడం దారుణమన్నారు. ఐదు సార్లు జాయింట్ లేబర్ కమిషనర్ వద్ద చర్చలు జరిగినా యాజమాన్యం మంకుపట్టుదలతో వ్యవహరిస్తుందన్నారు. కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతున్నా కార్మిక శాఖ అధికారులు చర్యలు తీసుకోవట్లేదన్నారు. కార్మిక శాఖ మంత్రికి కూడా కంపెనీ యాజమాన్యం అబద్దాలు చెబుతుందన్నారు. ఈ ఆందోళనలో సిఐటియు జిల్లా కార్యదర్శి డి.క్రాంతికుమార్, గంగాధర్, సతీష్, రామకృష్ణ, వరప్రసాద్, మల్లికార్జునరావు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



ఆక్రమణ స్థలంలో ఏర్పాటు చేసిన సిమెంట్ స్తంభాలు

జగనన్న లేఔట్‌లో స్థలం ఆక్రమణ

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

పొన్నాడ గ్రామంలో ఉన్న జగనన్న లేఔట్‌లో రోడ్డుకు అనుకుని ఉన్న రెండు సెంట్ల స్థలాన్ని ఆక్రమించి సిమెంట్ పోల్స్ వేశారు. రానున్న రోజుల్లో తీర ప్రాంతం అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశంతో కొంతమంది ముందస్తుగా రోడ్ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాలను దర్జాగా కబ్జా చేసుకుని నిర్మాణాలు చేపడుతున్నారు. కబ్జాకు గురైన స్థలాలపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పొన్నాడ గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై అధికారులను వివరణ కోరగా లే-ఔట్‌లో సిమెంట్ పోల్స్‌ను తొలగిస్తామనితెలిపారు.

తప్పడు కేసులను ఎత్తివేయాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

వైసిపి హయాంలో టిడిపి నాయకులు, కార్యకర్తలపై నమోదు చేసిన తప్పుడు కేసులన ఎత్తివేయాలని హోం మంత్రి అనితను కాకినాడ రూరల్ నియోజక వర్గ కో-ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎంఎల్‌ఎ పిల్లి అనంతలక్ష్మి కోరారు. విజయవాడలో హోం మంత్రిని వారు కలుసుకుని కాసేపు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్దేశపూర్వకంగానే వైసిపి వారు టిడిపి నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టారన్నారు. వీలైనంత త్వరగా కేసులు ఎత్తివేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై హోం మంత్రి సానుకూలంగా స్పందించారు. కేసులు ఎత్తివేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం టిడిపి కేంద్ర కార్యాలయంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ ఫరూక్‌ను పిల్లి దంపతులు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువా కపి సత్కరించారు. మంత్రులను కలిసిన వారిలో పెరికి సాధికార సమితి జిల్లా కన్వీనర్ కె.నరసింగరావు, టిడిపి నాయకులు కంటే సత్యనారాయణ, రూపేష్‌కుమార్ ఉన్నారు.